ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక
Bullet Edition
సోమవారం 17 నవంబరు
www.prajaswaramdaily.com

## స్వాగతించదగ్గ పరిణామం

### ఏపీ డిప్యూటీ సీఎం పవన్



అమరావతి, ప్రజాస్వరం : అన్ని రాష్ట్రాల్లోనూ కదలిక తీసుకువచ్చారని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ అన్నారు. ఐబొమ్మ నిర్వాహకుడి అరెస్ట్ నేపథ్యంలో సినీ ప్రముఖులు హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. వారంతా పోలీసుశాఖకు ధన్యవాదాలు తెలిపారు. ఈ క్రమంలో పవన్‌కల్యాణ్ ఎక్స్ వేదికగా స్పందించారు. " సినిమాలు విడుదలైన రోజే ఆన్‌లైన్‌లోకి వచ్చేస్తున్నాయి. విడుదలే ఒక మహాయజ్ఞంగా మారిపోయిన తరుణంలో పైరసీ ముఠాలను కట్టడి చేయడం దర్శకనిర్మాతలకు సాధ్యం కావడం లేదు. పైరసీలో కీలకంగా ఉన్న ఐబొమ్మ, బప్పమ్ వెబ్‌సైట్ల నిర్వాహకుడిని హైదరాబాద్ పోలీసులు అరెస్టు చేసి, వాటిని మూయించివేయడం స్వాగతించదగ్గ పరిణామం. పోలీసులకు సైతం సవాల్ విసిరే స్థాయికి పైరసీ ముఠాలు వచ్చిన తరుణంలో హైదరాబాద్ సైబర్ క్రైం పోలీసుబృందం చేసిన ఆపరేషన్ విజయవంతమైంది. ఈ ఆపరేషన్‌లో భాగమైన పోలీసులకు, సిటీ కమిషనర్ వి.సి.సజ్జనార్‌కి అభినందనలు తెలియజేస్తున్నా" అని ఎక్స్ లో ఆయన పోస్టు చేశారు.

# 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా

### ఐ బొమ్మ నిర్వాహకుడు రవి..
### సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు
### పైరసీ ద్వారా నష్టం, బెట్టింగ్ యాప్‌లు ప్రమోట్ ...
### హైదరాబాద్ సీపీ సజ్జనార్



హైదరాబాద్ , ప్రజాస్వరం: ఐ బొమ్మ నిర్వాహకుడు రవి వద్ద 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా ఉందని హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్ తెలిపారు. అగ్ర కథానాయకులు చిరంజీవి, నాగార్జున, దర్శకుడు రాజమౌళి, నిర్మాత దిల్‌రాజు...హైదరాబాద్ నగర సీపీ సజ్జనార్‌తో భేటీ అయ్యారు. అనంతరం సజ్జనార్ విలేకరులతో మాట్లాడారు. పైరసీతో సినీ రంగానికి చాలా నష్టం జరిగిందని తెలిపారు. దీన్ని కట్టడి చేయడంలో భాగంగా ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవిని అరెస్టు చేసినట్లు తెలిపారు. అతడిపై ఐటీ యాక్ట్, కాపీ రైట్ యాక్ట్ కింద మరో 4 కేసులు నమోదు చేసినట్లు చెప్పారు. "పైరసీకి సంబంధించి అంతకు ముందు ప్రశాంత్, శివరాజ్‌ను కూడా అరెస్టు చేశాం. ఇమ్మడి రవి సమాజానికి చాలా నష్టం చేకూర్చాడు. పైరసీ ద్వారా నష్టం చేయడమే కాకుండా బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేస్తున్నాడు. దీంతో చాలా మంది చనిపోయారు. ఒక వెబ్‌సైట్‌ను బ్లాక్ చేస్తే కొత్త సైట్‌ను తయారు చేశాడు. ఇలా65 మిర్రర్ వెబ్‌సైట్లు నిర్వహించాడు. 21 వేల సినిమాలు అతడి హార్డ్ డిస్క్‌లో ఉన్నాయి. 1972లో విడుదలైన గాడ్‌ఫాదర్ నుంచి మొన్న వచ్చిన ఓజీ వరకు అందులో ఉన్నాయి. రూ.20 కోట్లు పైరసీ ద్వారా సంపాదించాడు. అందులో రూ.3 కోట్లు సీజ్ చేశాం. 50 లక్షల మంది సబ్‌స్క్రైబర్ల డేటా రవి వద్ద ఉంది. ఇంత డేటా అతడి వద్ద ఉ ఒడటం ప్రమాదకరం. దీన్ని సైబర్ నేరగాళ్లు వాడుకునే అవకాశం ఉంది.

### 21 వేల సినిమాలు పైరసీ ..
### సెయింట్ నేవీ దేశ పౌరసత్వం తీసుకున్నాడు

ఇమ్మడి రవి స్వస్థలం విశాఖ.. బీఎస్సీ కంప్యూటర్స్ చదివాడు. అతడు వేరే పేర్లతో మహారాష్ట్రలో డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డులు తీసుకున్నాడు. సినీరంగం అప్రమత్తమై ఫిర్యాదు చేసినప్పుడు పోలీసులు అతడి వెంట పడ్డారు. దీంతో భారత పౌరసత్వాన్ని వదిలి కరేబియన్ దీవుల్లో ఉన్న సెయింట్ నేవీ దేశ పౌరసత్వం తీసుకున్నాడు. ఆయన ఫ్రాన్స్‌లో ఉంటూ వివిధ దేశాలు తిరిగేవాడు. 2019లో ఐబొమ్మ ప్రారంభించి 21 వేల సినిమాలు పైరసీ చేశాడు. అమెరికా, స్విట్జర్లాండ్, నెదర్లాండ్స్‌లో సర్వర్లను పెట్టాడు. 110 డొమైన్స్ కొనుక్కున్నాడు. ఒకటి బ్లాక్ చేస్తే మరొకటి ఓపెన్ చేస్తూ పైరసీ సినిమాలు విడుదల చేశాడు. ఈ రాకెట్‌లో ఉన్న మిగతా వాళ్లను కూడా బయటకు తీసుకువస్తాం" అని సజ్జనార్ తెలిపారు.




### సవాలు చేయడాన్ని తట్టుకోలేకపోయాం : చిరంజీవి

సినీ ఇండస్ట్రీ మీద చాలామంది ఆధారపడి ఉన్నారని, వాళ్ల కష్టాన్ని దౌర్జన్యంగా దోచుకుంటుంటే బాధగా ఉ ంటుందని సినీనటుడు చిరంజీవి అన్నారు.పైరసీ చేసి.. తిరిగి పోలీసులకే సవాలు విసరడాన్ని తట్టుకోలేకపోయాను అని అన్నారు.



### మా కుటుంబంలో ఒకరి డిజిటల్ అరెస్టు : నాగార్జున

మా కుటుంబంలో ఒకరి డిజిటల్ అరెస్టు అయ్యారని, రెండు గంటల పాటు నిర్బంధించారని, పోలీసులు వచ్చే లోపు వారు పరార్ అయ్యారని సినీనటుడు నాగార్జున తెలిపారు. పైరసీని అరికట్టేందుకు తెలంగాణ పోలీసులు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు.



### డేటాను క్రిమినల్స్‌కు అమ్మడంతోనే డబ్బు ..: రాజమౌళి

పైరసీ సైట్ల ద్వారా ప్రజల డేటాను క్రిమినల్స్‌కు అమ్ముతున్నారని ప్రముఖ దర్శకుడు రాజమౌళి అన్నారు. పోలీసులకు కృతజ్ఞతలు. ఇదొక సినిమా సూపర్ హిట్ సీన్ లా ఉంది.

# మరో 15 ఏళ్లు మా ప్రభుత్వమే

### మంత్రి కోమటిరెడ్డి




మిర్యాలగూడ, ప్రజాస్వరం: మరో 15 ఏళ్లు రాష్ట్రంలో కాంగ్రెస్సే అధికారంలో ఉంటుందని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ఇది రుజువైందని చెప్పారు. నల్గొండ జిల్లా మిర్యాలగూడ మండలం కాల్వపల్లి వద్ద రింగురోడ్డు పనులకు మరో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ రఘువీ-ర్‌రెడ్డితో కలిసి ఆయన శంకుస్థాపన చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో ఒక పార్టీకి డిపాజిట్ గల్లంతైందని.. మరో పార్టీ కుటుంబ కలహాలతో కొట్టుమిట్టాడుతోందన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. అన్ని సింగిల్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తున్నామన్నారు. స్థానిక ఎన్నికల్లో అధికార పార్టీ అభ్యర్థులను గెలిపిస్తే వారి ద్వారా అన్నిరంగాల్లో మరింత అభివృద్ధి సాధిస్తామని చెప్పారు.

### అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయం

రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు ఉమ్మడి నల్గొండ జిల్లా కార్యకర్తల కృషి కారణమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం ముందుకెళ్తోందని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాలుగా అండగా ఉ ంటుందని చెప్పారు. పదేళ్లలో జరగని అభివృద్ధిని రెండేళ్లలో చేసి చూపించామన్నారు.

# బంగ్లా మాజీ ప్రధాని హసీనాకు ఉరిశిక్ష

### బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో దోషి తేల్చిన ఐసీటీ
### బంగ్లా ట్రైబ్యునల్ సంచలన తీర్పు



ఢాకా, ప్రజాస్వరం: బంగ్లాదేశ్ అల్లర్ల కేసులో బంగ్లా మాజీ ప్రధాని హసీనాకు ఢాకాలోని ఇంటర్నేషనల్ క్రైమ్స్ ట్రైబ్యునల్(ఐసీటీ) ఉరిశిక్ష విధించింది. మానవత్వానికి వ్యతిరేకంగా నేరాలకు పాల్పడ్డారన్న అభియోగాల నేపథ్యంలో ఆమెపై పలు కేసులు నమోదయ్యాయి. వీటిపై వాదనలు విన్న ట్రైబ్యునల్ సోమవారం దోషిగా తేల్చింది. గత ఏడాది జులై-ఆగస్టుల్లో జరిగిన ఆందోళనల్లో 1400 మంది మృతి చెందారని ఐసీటీ న్యాయమూర్తి వెల్లడించారు. తనకు వ్యతిరేకంగా నిరసన చేస్తున్న వారిని చంపేయమని ఆమె ఆదేశాలు ఇచ్చారని పేర్కొన్నారు. ఈ కేసులో మాజీ హెూంమంత్రి అసదుజ్జమాన్ ఖాన్‌కు సైతం కోర్టు మరణశిక్ష విధించింది. పోలీస్ మాజీ చీఫ్ చౌధురీ అబ్దుల్లా అల్-మామున్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించింది.

ఆగస్టు 5న ఢాకాలో నిరసనకారులపై ఆర్మీ కాల్పులు జరిపిందని, వారిపై హెలికాప్టర్లు, ప్రాణాంతక ఆయుధాలు ఉపయోగించాలని ఆమె ఆదేశించారని మరో న్యాయమూర్తి తీర్పు లో ప్రస్తావించారు. ఈ మేరకు దర్యాప్తు నివేదికను చదివి వినిపించారు. గాయపడినవారికి వైద్యం అందించేందుకు నిరాకరించారన్నారు. ఆమె అధికారంలో ఉ ండేందుకు బలప్రయోగం చేశారని పేర్కొన్నారు. తీర్పు ఇవ్వడంలో ఏదైనా ఆలస్యం జరిగితే క్షమించాలన్నారు. ఇక తీర్పు నేపథ్యంలో ఐసీటీ చుట్టూ భద్రతను కట్టుదిట్టం చేశారు.

ఈ తీర్పు నేపథ్యంలో బంగ్లాదేశ్ లో ముఖ్యంగా రాజధాని నగరం ఢాకాలో హై అలర్ట్ ప్రకటించారు. ఎవరైనా వాహనాలు తగలబెట్టేందుకు, బాంబులు విసిరేందుకు ప్రయత్నిస్తే.. వారిని కాల్చివేయాలంటూ ఢాకా పోలీస్ చీఫ్ షేక్ మహమ్మద్ సజ్జత్ అలీ ఆదేశాలు ఇచ్చారు.